## క్లుప్తంగా

### కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న కడా అధికారి

దౌల్తాబాద్: మండల పరిధి 88 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను మంగళవారం (కడా)కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, తహసీల్దారు విజయ్‌కుమార్ తదితరులున్నారు.

### ఆలయ వార్షికోత్సవం



ఆలయ ప్రాంగణంలో హోమం చేస్తున్న భక్తులు

ధారూరు: మండల కేంద్రంలోని గ్రామ దేవత మైసమ్మ ఆలయ తృతీయ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుత పూజారులు చెన్నబసవయ్యస్వామి, కుమారస్వామీలు అమ్మవారిని పాలు, జలంతో అభిషేకం చేసి అలంకరించారు. మహిళలతో సామూహిక కుంకుమార్చన తర్వాత హోమం నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

### ఎస్‌ఐకి సన్మానం



ఎస్‌ఐని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ధారూరు: నూతన ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్‌ను మంగళవారం కాంగ్రెస్ మండల ప్రజాప్రతినిధులు, నాయకులు శాలువాలు కప్పి, పుష్ప గుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. సన్మాన కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రాములు, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు బసప్ప, నాయకులు నారాయణరెడ్డి, మల్లారెడ్డి, రమేశ్‌కృష్ణ, ముజాఫర్, పాండునాయక్, బల్వంత్‌రెడ్డి, హరిచంద్, ఇబ్రహీం, ప్రకాశ్, నర్సింహులు పాల్గొన్నారు.

### టెంకాయల వేలం పాట

కుల్కచర్ల: పాంబండ దేవస్థానంలో జరిగే జాతరలో టెంకాయలు విక్రయించేందుకు ఈ నెల 22న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ నర్సమ్మరాములు, ఈఓ సుధాకర్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధి బండవెల్కిచర్ల శ్రీపాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో ఏప్రిల్ మొదటివారంలో జరగనున్న బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఈ వేలం నిర్వహిస్తున్నామని, ఆసక్తి గల వ్యాపారులు వేలం పాటలో పాల్గొనాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఆలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

### షాదీఖానా నిర్మించాలి



ప్రత్యేకాధికారికి వినతిపత్రం అందజేస్తున్న మైనార్టీ నాయకులు

కొడంగల్ రూరల్: తాండూరు రోడ్‌లో శిథిలావస్థకు చేరిన షాదీఖానా స్థానంలో మినీ హజ్ హౌజ్, షాదీఖానా నిర్మించాలని మైనార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. మినీ హజ్‌హౌజ్ నిర్మాణానికి స్థలాన్ని కేటాయిస్తూ నిధులు మంజూరు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఇందులో మాజీ ఉప సర్పంచ్ ఎస్‌ఎం.గౌసన్, కాంగ్రెస్ మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు ఆసిఫ్‌ఖాన్, నాయకులు మహ్మద్ షాకీర్ ఖాద్రి, సయ్యద్ అశ్వక్, హమీద్ అలీ, మహమ్మద్ రహీమ్ మౌలానా హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

### సైబర్ నేరాలపై అవగాహన

మొయినాబాద్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మొయినాబాద్ ఏఎస్సై శివారెడ్డి అన్నారు. మండలంలోని గురుకుల కళాశాల విద్యార్థులకు మంగళవారం పోలీసులు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌లో ఆటలు ఆడే సమయంలో వచ్చే లింకులు, వాట్సాప్‌లో వచ్చే లింకులు ఓపెన్ చేయొద్దని సూచించారు. ఓటీపీ నంబర్లను ఇతరులకు షేర్ చేయవద్దని చెప్పారు. సైబర్ నేరగాళ్లు బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని అకౌంట్ నంబర్, ఏటీఎం పిన్, ఓటీపీ అడిగితే చెప్పవద్దన్నారు. బ్యాంక్ అకౌంట్, పిన్ నంబర్లు, ఓటీపీలో ఆన్‌లైన్‌లో షేర్ చేయవద్దన్నారు. విద్యార్థులు అవగాహన పెంచుకుని ఇతరులకు తెలియజేయాలని చెప్పారు. కానిస్టేబుళ్లు శ్రావణయాదవ్, శ్రీనివాస్, మహేశ్వర్‌రెడ్డి, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉపాధికోసం ఆరాటం



దుకాణ సముదాయాలు నిర్మించ తలపెట్టిన స్థలం

- పూర్తయిన రహదారి విస్తరణ
- దుకాణ సముదాయానికి చిరు వ్యాపారుల ఎదురు చూపులు
- నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న పరిషత్

మోమిన్‌పేట: మండల కేంద్రంలో నాలుగు వరుసల రహదారి విస్తరణ పనులు చివరి దశలో ఉన్నాయి. ఇక మిగిలింది మండల పరిషత్ ఎదుట నిర్మించ తలపెట్టిన దుకాణ సముదాయమే. కానీ నిధుల లేమితో ఆ ప్రస్తావన పక్కకు పోగా.. భవన సముదాయం నిర్మిస్తే.. వ్యాపారం చేసుకొని, ఉపాధి పొందుదామని చిరువ్యాపారులు చాలా కాలంగా ఆశగా ఎదురు చూస్తున్నారు.

**అద్దె రూపేనా ఆదాయం**

గతంలో ఇదే మార్గంలో రోడ్డు వెడల్పు పనులు చేపట్టక ముందు.. స్థానికులు రేకుల షెడ్లు, డబ్బాలు వేసుకొని వ్యాపారం చేసుకొనే వారు. విస్తరణలో భాగంగా ఆయా దుకాణాలను తొలగించడంతో వారి జీవనోపాధి కోల్పోయారు. ప్రస్తుతం రేకుల షెడ్లు, తోపుడు బండ్లతో కాలం నెట్టుకొస్తున్నారు. మండల పరిషత్ ఆధ్వర్యంలో దుకాణ సముదాయన్ని నిర్మిస్తే.. వ్యాపారులకు ఉపాధి కల్పించడంతో పాటు, అద్దె రూపంలో నెలకు రూ.2లక్షల వరకు ఆదాయం సమకూరుతుందని స్థానికులు అభిప్రాయం వ్యక్తంచేశారు.

**నెరవేరని చైర్‌పర్సన్ హామీ**

రోడ్డు వెడల్పు పనులు జరుగుతున్న సమయంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి నిర్మాణ పనులను సందర్శించారు. ఉపాధి కోల్పోయిన చిరు వ్యాపారులను దృష్టిలో పెట్టుకొని, దుకాణ సముదాయ నిర్మాణానికి రూ.20లక్షలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కానీ నేటికీ ఆ నిధులు మంజూరు కాలేదు. మండల పరిషత్‌లో నిధులు నిండుకున్నాయి. గతంలో వలే బీఆర్‌జీఎఫ్ నిధులు వచ్చి ఉంటే దుకాణ సముదాయాలను నిర్మించే వారమని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

**ఉపాధి దొరుకుతుంది**



చిన్న డబ్బాలో టీ స్టాల్ నడిపించుకొని జీవనం కొనసాగిస్తున్నా. రోడ్డు వెడల్పు కావడంతో దుకాణాలు నిర్మించి, చిరు వ్యాపారులకు అద్దెకు ఇస్తే బాగుంటుంది. తద్వారా మాకు ఉపాధి దొరుకుతుంది. ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది.

– ముజీబ్, చిరువ్యాపారీ

**పరిషత్‌లో నిధులు లేవు**



మండల పరిషత్‌లో పైసలు లేవు. నాడు జెడ్పీ చైర్‌పర్సన్ రూ.20లక్షలు ఇస్తామన్నారు. ఇంకా ఇవ్వలేదు. ఆ నిధులు మంజూరు చేస్తే.. దుకాణ సముదాయాలు నిర్మించి, చిరు వ్యాపారులకు అద్దెకు ఇస్తాం. దీంతో మండల పరిషత్‌కు శాశ్వత ఆదాయం వస్తుంది.

– దబ్బుని వసంత, ఎంపీపీ

## ‘పేట’కు తీరిన విద్యుత్ సమస్య

హర్షం వ్యక్తంచేసిన గ్రామస్తులు



పనులను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

యాలాల: యాలాల అనుబంధ గ్రామమైన గోవిందరావుపేటకు కరెంటు సమస్య తీరింది. గతంలో సంగెంకుర్దు ఫీడర్ కనెక్షన్‌లో ఈ గ్రామం ఉండేది. దీంతో 30 ఏళ్లుగా ప్రతి వర్షాకాలంలో విద్యుత్ సరఫరా సరిగా ఉండేది కాదు. ఈ క్రమంలో కాంగ్రెస్ గ్రామ సీనియర్ నాయకుడు పేరి రాజేందర్‌రెడ్డి.. సమస్యను ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే స్పందించి, గ్రామానికి ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు, యాలాల గ్రామం నుంచి పేటకు ప్రత్యేక లైన్(విద్యుత్ తీగలు)ను వేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో ఈ పనులను ట్రాన్స్‌కో సిబ్బంది మంగళవారం పూర్తి చేశారు. మూడు దశాబ్దాలుగా ఎన్నో ఇబ్బందులు పడిన గ్రామస్తులు.. సమస్య పరిష్కారం కావడంతో సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు అక్బర్‌బాబా, పార్టీ గ్రామ అధ్యక్షుడు నాగయ్య, ఉపాధ్యక్షుడు గంతల మొయిజ్, చిన్న, ప్రధాన కార్యదర్శి అహ్మద్, గ్రామ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్ నాయి, నాయకులు శేఖర్, లాలయ్య, మౌలాన, షబ్బీర్, అయ్యప్ప, శేఖర్, మోసిన్, నర్సింహులు, ఉమేష్ తదితరులు ఉన్నారు.

## పారిశుద్ధ్య కార్మికురాలికి సన్మానం



లక్ష్మిని సన్మానిస్తున్న అధ్యాపక సిబ్బంది

కొడంగల్ రూరల్: హస్నాబాద్ పంచాయతీ కార్మికురాలుగా పనిచేస్తున్న లక్ష్మి.. ప్రధాని చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకోవడం అభినందనీయమని ప్రిన్స్‌పాల్ జె.రాజారాం అన్నారు. మంగళవారం పట్టణ శివారులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కార్మికురాలు కంతి లక్ష్మిని, ప్రిన్స్‌పాల్ రాజారాం, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు శాలువాలు కప్పి, ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్స్‌పాల్ మాట్లాడారు. విద్యార్థులు కార్మికురాలు లక్ష్మిని ఆదర్శంగా తీసుకొని, ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలని సూచించారు. అవార్డు గ్రహీత లక్ష్మి మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేరు చేయడం, సేంద్రియ ఎరువు తయారీ, ఇంటి ముందు ఖాళీ ప్రాంతంలో కూరగాయలు, పండ్లు, పూల మొక్కలు పెంచడంతో ఆరోగ్యవంతమైన జీవనం సాగించేందుకు వీలుంటుందని పేర్కొన్నారు.

## ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



విద్యార్థులతో ఉపాధ్యాయ సిబ్బంది

కొడంగల్ రూరల్: పట్టణంలోని కేంద్ర బాలికల ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఘనంగా స్వయం పరిపాలనా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి, తోటివారికి పాఠాలు భోదించారు. విద్యాధికారులుగా వ్యవహరించిన (డీఈఓ శివశంకర్, ఎంఈఓ జైఫాన్, హెచ్‌ఎం రాంచరణ్) వారికి హెచ్‌ఎం రాములు బహుమతులు అందజేశారు. ఇందులో ఉపాధ్యాయ సిబ్బంది అబ్దుల్‌హఖ్, వెంకటేశం, సాలిబాయి, సబీరాబేగం, నసీంబాను, విద్యార్థులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు



కోదండ సీతారామస్వామి

కుల్కచర్ల: కుల్కచర్ల మండలం పుట్టపహడ్ గ్రామంలోని కోదండ సీతారామ స్వామి బ్రహ్మోత్సవాలను 15వ తేదీ నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నామని ఆలయ ధర్మకర్త రమేశాచార్యులు పేర్కొన్నారు. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు గణపతిపూజ, ధ్వజారోహణం, సర్వదేవతాపూజలు, పల్లికీసేవ, ఎదురుకోలు, భజన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. 16న సర్వదేవతాపూజలు నిర్వహించడంతో పాటు హోమం, సీతారాముల వారి కల్యాణోత్సవం, రాత్రికి భజనలు చేపట్టనున్నారు. 17న తెల్లవారుజామున రథోత్సవం(తేరు), సాయంత్రం శకటోత్సవం, చక్రతీర్థం, మంగళహారతితో వేడుకలు ముగుస్తాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ధర్మకర్త రమేశాచార్యులు, కార్యనిర్వాహకులు రాఘవేందర్‌రెడ్డిలు కోరారు.

## సమస్యలపై ఐక్యంగా పోరాడాలి

రజక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్

చేవెళ్ల: సమస్యలపై పరిష్కారానికి రజకులంతా ఐక్యంగా కలిసి పోరాడాల్సిన అవసరం ఉందని రజక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య, నియోజకవర్గం అధ్యక్షుడు మల్లేశ్‌లు అన్నారు. మండలకేంద్రంలోని అర్ అండ్‌బీ అతిథి గృహం వద్ద మంగళవారం మండల రజక సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చేవెళ్ల మండల రజక సంఘం అడహక్ కమిటీని ఎంపిక చేశారు. కమిటీ చైర్మన్‌గా చేవెళ్లకు చెందిన లక్ష్మయ్య, కమిటీ సభ్యులుగా గుండాల శ్రీనివాస్, ఊరేళ్ల యాదయ్య, ఎన్కేపల్లి యాదయ్య, రావులపల్లి కుమార్, దీపక్, పాండు, రామన్నగూడ ప్రభాకర్, న్యాలట శ్రీశైలం, తదితరులను ఎంపిక చేశారు. వారు మాట్లాడుతూ.. రజక సంఘం సభ్యులంతా ఏకతాటిపైకి వచ్చి, సభ్యులంతా ఒక కమిటీగా ఏర్పడాలని చెప్పారు. మండలంలోని ప్రతి గ్రామంలో గ్రామ కమిటీలను మండల అడహక్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయటం జరుగుతుందని చెప్పారు. ఆరు నెలల్లో మండలంలోని అన్ని గ్రామాల్లో పూర్తి స్థాయి కమిటీలను ఏర్పాటు చేసిన తరువాత మండల నూతన కమిటీని ఎన్నుకోవటం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో రజక సంఘం సభ్యులు వై. శ్రీనివాస్, అశోక్, శ్రీనివాస్, జంగయ్య, మల్లేశ్, రాజేశ్, మదు, రాకేశ్, శ్రీనివాస్, శివకుమార్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

### వివాహానికి ఆర్థిక సహాయం

కుల్కచర్ల: నిరుపేద ప్రజలకు అండగా ఉంటామని పీఎస్‌పీఎస్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్ అన్నారు. మంగళవారం మండల పరిధి ఘనపూర్ గ్రామంలో ‘మేముసైతం’ అనే కార్యక్రమం ద్వారా.. మిద్దె వెంకటయ్య కూతురు వివాహానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఇందులో చీపిరి రాములు, రాంచంద్రయ్య, ల్యాగల చంద్రయ్య, హన్మయ్య, ఆంజనేయులు, రాము, కొండ నర్సింహులు, వెంకటమ్మ తదితరులు ఉన్నారు.

### 16న రథసప్తమి ఉత్సవాలు

అనంతగిరి: వికారాబాద్ సమీపంలోని బుగ్గ రామలింగేశ్వర స్వామి క్షేత్రంలోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఈ నెల 16న రథ సప్తమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం 5గంటలకు స్వామి వారికి అభిషేకం, 10గంటలకు హోమం, ఒంటి గంటకు పల్లకీ సేవా, అనంతరం అన్నదాన చేయనున్నట్లు పేర్కొన్నారు. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

### అయోధ్యకు బయల్దేరిన రామభక్తులు



అయోధ్యకు వెళ్తున్న రామభక్తులు

దోమ: మండల పరిధి కొండాయపల్లి గ్రామానికి చెందిన పలువురు రామ భక్తులు మంగళవారం బల రామున్ని దర్శించుకునేందుకు అయోధ్యకు బయల్దేరారు. శతాబ్దాల అనంతరం ప్రధాని మోదీ ఆధ్వర్యంలో రామమందిరం కల నెరవేరడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కేశవులు, మహేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ చైర్‌పర్సన్‌పై దాడి అమానుషం



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం ప్రతినిధులు

- నిందితులపై చర్యలు తీసుకోవాలి
- ఆర్యవైశ్య రాష్ట్ర మహాసభ ఉపాధ్యక్షుడు బాలేశ్వర్‌గుప్తా

తాండూరు: అచ్చంపేట మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అరుణగుప్తాపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలేశ్వర్‌గుప్తా అన్నారు. మంగళవారం తాండూరు పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణమంటపంలో నిర్వహించిన సమావేశంలో సంఘం తాండూరు అధ్యక్షుడు కట్కం వీరేందర్ తదితరులు మాట్లాడారు. ఆర్యవైశ్యులు ఇప్పుడిప్పుడే రాజకీయాల్లో పట్టు సాధిస్తున్నారని, అయితే వారి ఎదుగుదలను జీర్ణించుకోలేని వారు ఇలాంటి చేష్టలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మార్కెట్‌యార్డులో తూకంలో మోసం జరిగినా, రైతులకు గిట్టుబాటు ధర లభించకపోయినా మార్కెట్ కమిటీ కార్యాలయం, లేదా ప్రభుత్వానికి ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. కానీ.. కమిటీ చైర్‌పర్సన్‌పై దాడి చేయడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. దాడులకు పాల్పడిన వారు ఎంతటివారైనా ఉపేక్షించకుండా, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం తాండూరు ప్రధాన కార్యదర్శి కోట మురళీకృష్ణ, ఉపాధ్యక్షుడు అలంపల్లి శ్రీనివాస్, సహాయ కార్యదర్శి దాదాపురం రవీందర్, కోశాధికారి రొంపల్లి సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ధరల నియంత్రణలో కేంద్రం విఫలం

సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మహిపాల్

బంట్వారం: ధరల నియంత్రణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్.మహిపాల్ ఆరోపించారు. కేంద్రం అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ ఈ నెల 16న చేపట్టే ‘గ్రామీణ భారత్ బంద్’ వాల్ పోస్టర్‌ను మంగళవారం ఆయన తొర్మామిడిలో ఆవిష్కరించి మాట్లాడారు. మోదీ పదేళ్ల పాలనలో పేదలు మరింత నిరు పేదలయ్యారన్నారు. పెట్రోల్, వంట గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయని చెప్పారు. ఉపాధి కూలీలకు బడ్జెట్ పెంచకుండా ఉన్నదాంట్లో తగ్గించారని మండిపడ్డారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధర లేదన్నారు. ప్రతి ఒక్కరి ఖాతాలో వేస్తామన్న రూ.15 లక్షలు ఏమైనట్లని ప్రశ్నించారు. 20 కోట్ల ఉద్యోగాల ఊసే లేదని మండిపడ్డారు. రాష్ట్రాల హక్కులను హరించడం హాస్యాస్పదమన్నారు. దేశ సంపదను పెట్టుబడి దారులకు కట్టబెడుతూ.. నిత్యవసరాల ధరలు పెంచేస్తున్నారని విమర్శించారు. కేంద్రం వైఖరికి నిరసనగా చేపట్టే బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ, రైతుసంఘం, సీపీఎం నాయకులు శ్రీనివాస్, లక్ష్మయ్య, నర్సింహులు, ఏసయ్య, స్వామిదాస్, లక్ష్మణ్, మాణెయ్య, పద్మమ్మ, రత్నప్ప, అబ్బాస్, మన్నన్ పాల్గొన్నారు.

## న్యూట్రిషన్‌తో విటమిన్ ఏ లోపం నివారణ

ఆర్డీఓ సాయిరాం



చుక్కల మందు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

చేవెళ్ల: కంటిచూపు దెబ్బతినకుండా ప్రభుత్వం అందిస్తున్న విటమిన్ ఏ న్యూట్రిషన్ సప్లమెంటరీ (ద్రవణం)మందును పిల్లలకు తల్లిదండ్రులు తప్పనిసరిగా వేయించాలని ఆర్డీఓ సాయిరాం సూచించారు. విటమిన్ ఏ చుక్కల మందు వేసే కార్యక్రమాన్ని మంగళవారం ఆర్డీఓ సాయిరాం, చేవెళ్ల డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విటమిన్ ఏ చుక్కల మందు వేయటం వలన కంటి చూపు మెరుగుపడుతుందన్నారు. పిల్లలలో ఎక్కువగా ఎదుర్కొంటున్న కంటి చూపు సమస్యల నివారణకు ఇది ఉపయోగపడుతుందని చెప్పారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్ మాట్లాడుతూ.. పిల్లలకు చుక్కల మందు వేయడం వల్ల రోగ నిరోధక శక్తి మెరుగుపడుతుందన్నారు. విటమిన్ ఏ లోపం కారణంగా రేచీకటి సమస్య వచ్చే ప్రమాదం ఉందని విటమిన్ ఏ లోపం తీవ్రంగా ఉంటే రేటీనా, కార్నియా దెబ్బ తింటుందన్నారు. చిన్నారుల్లో విటమిన్ లోపాలు ఉంటే ఎదుగుదల సరిగా ఉండదని చెప్పారు. 13వ తేదీ నుంచి 18వ తేదీ వరకు ఈ విటమిన్ ఏ చుక్కల మందు పంపిణీ జరుగుతుందని చెప్పారు. చేవెళ్ల డివిజన్‌లోని ఆలూరు, శంకర్‌పల్లి, టంగటూరు, మొయినాబాద్, చందన్‌వెల్లి, షాబాద్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ చుక్కల ముందు వేసే కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. చేవెళ్ల డివిజన్‌లో 9నెలల నుంచి ఐదేళ్లలోపు చిన్నారుల సంఖ్య 18,319 మంది ఉన్నట్లు గుర్తించటం జరిగిందన్నారు. మొదటి రోజు 3,038 మంది చిన్నారులకు మందు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రఘుబాబు, డాక్టర్ వేదశ్రీ, గోపాల్‌రెడ్డి, సంతోష, మంజుల, సుదర్శన్, బలరాం, ఏఎస్ఎంలు, ఆశవర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రవీణ, ఉమారాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### ఉచిత వైద్య శిబిరాలతో లబ్ధి

షాబాద్: గ్రామీణ ప్రాంత ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని దోస్వాడ రాజు సూచించారు. మంగళవారం మండలంలోని తాళ్లపల్లిలో శంకర్‌పల్లి విజయ హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో పేదలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన 400 మందికి పైగా వైద్య పరీక్షలు చేశారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్లు విష్ణువర్ధన్‌రెడ్డి, తాళ్ల సుభాష్‌గౌడ్ వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు.

# ‘మన నీరు మనకే కావాలి’



కుల్కచర్ల: సభకు వెళ్లిన బీఆర్‌ఎస్ శ్రేణులు



తాండూరు: నల్లగొండ సభకు వెళ్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

- ప్రభుత్వ తప్పుడు నిర్ణయాలపై నిరంతర పోరాటం
- బీఆర్‌ఎస్ నాయకులు

కుల్కచర్ల: కృష్ణానది బోర్డును కేంద్రానికి అప్పగించడాన్ని నిరసిస్తూ బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు నల్లగొండలో నిర్వహించిన బహిరంగ సభకు మంగళవారం కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల నుంచి ఆ పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, రైతుబంధు మాజీ మండల అధ్యక్షులు రాజు మాట్లాడారు. ప్రభుత్వం తీసుకుంటున్న తప్పుడు నిర్ణయాలపై పార్టీ నిరంతరాయంగా పోరాటం చేస్తుందన్నారు.

**తాండూరు నుంచి..**

తాండూరు: ‘మన నీరు మనకే కావాలి. ప్రాజెక్టులపై ఇతరుల పెత్తనం చేస్తే మరోసారి పోరాటం తప్పదని’ బీఆర్‌ఎస్ తాండూరు నాయకులు అన్నారు. మంగళవారం పార్టీ ఆధ్వర్యంలో నల్లగొండలో నిర్వహించిన బహిరంగ సభకు.. మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో నాలుగు ఆర్టీసీ బస్సుల్లో గులాబీ శ్రేణులు తరలి వెళ్లారు.

**దోమలో..**

దోమ: కృష్ణా నది ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వం కేఆర్‌ఎంబీకి అప్పగించడాన్ని నిరసిస్తూ కేసీఆర్ ఇచ్చిన పిలుపుమేరకు బీఆర్‌ఎస్ నేతలు నల్లగొండలో నిర్వహించిన బహిరంగ సభకులు బయల్దేరారు. మండల కేంద్రంతో పాటు బొంపల్లి, బాస్‌పల్లి, మోత్కుర్, ఐనాపూర్, కిష్టాపూర్, బ్రహ్మణపల్లి, దాదాపూర్, కొత్తపల్లి, గుండాల గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ మల్లేశం, బొంపల్లి ఎంపీటీసీ రాములు, మండల మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ లక్ష్మయ్య ముదిరాజ్, పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్ గౌడ్, నాయకులు సలీం, రుక్మయ్య, తిరుపతయ్య, శేర్‌ఖాన్, మోహిన్‌పాష, డి.వెంకటేశ్, ఖలీల్, రమేశ్, బుక్కపాష, మహేశ్‌లక్కీ, టి.శ్రీనివాస్, మల్లేశ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం**

పరిగి: బీఆర్‌ఎస్ ప్రభుత్వం.. రైతు సంక్షేమం కోసం కృషి చేస్తే.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే వారిని మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి ఆరోపించారు. నల్గొండలో నిర్వహించిన బహిరంగ సభకు వెళ్తున్న బస్సును జెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుంటే.. ఊరుకునేది లేదని, ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, ఎంపీపీ అరవింద్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, సురేందర్, మౌలానా, వెంకట్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దోమ: సభకు తరలిన నేతలు



పరిగి: బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి